దుర్గమ్మా.. కరుణించమ్మా


కె.సావరంలో దుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ వారు


దుర్గామాత అలంకరణలో బ్రాహ్మణగూడెంలోని నాగారమ్మ


తాళ్లపూడిలో కనకదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


గోపాలపురంలో మహిషాసుర మర్ధిని అలంకారంలో దుర్గామాత


పెరవలి మండలం గవర్లపాలెంలో దుర్గమ్మ మండపానికి నిమ్మకాయలతో అలంకారం


మహిషాసుర మర్దిని అలంకరణలో నిడదవోలు రైల్వేస్టేషన్ సెంటర్ రోడ్డులోని దుర్గామాత

- అమ్మవారికి ఘనంగా దుర్గాష్టమి పూజలు
- కోట సత్తెమ్మకు ప్రత్యేక పుష్పాలంకరణ
- 469 మంది దంపతులతో సహస్ర నామ కుంకుమ పూజలు

నిడదవోలు రూరల్: ఊరూవాడా భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకుని మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారిని 8వ రోజు భారీగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలయ ప్రాంగణంలో అమ్మవారికి 469 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.3,60,547 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) చెప్పారు. భక్తులు అన్నసమారాధనలో అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధానార్చకుడు ఎస్‌వీకేఏ శర్మ విశేష పూజలు చేశారు. అలాగే మండలంలోని గోపవరం గ్రామంలోని గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలోని పుంతలో ముసలమ్మ, డి.ముప్పవరంలోని కొండాలమ్మ, ముత్యాలమ్మ వార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. లోహియానగర్‌లోని కనకదుర్గమ్మ, కంసాలిపాలెంలోని దేవీపాటిమ్మ అమ్మవార్లను సుందరంగా అలంకరించి, కుంకుమ పూజలు చేశారు.

నిడదవోలు: రైల్వేస్టేషన్ సెంటర్ రోడ్డులోని కనకదుర్గమ్మ వారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పట్టణ గ్రామదేవత అయిన నంగాలమ్మ పూరి గుడి వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు. చినకాశిరేవులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విద్యుత్తు అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

దుర్గాదేవి అలంకారంలో కామాక్షీదేవి

నల్లజర్ల: పోతవరం గ్రామంలో జమ్మి చెట్టు వద్ద గల కంచి కామాక్షి ఆలయ 35వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. ఏలేటి రాజేశ్వరరావు, వెంకటరమణ దంపతులు అర్చకుడు సూరిబాబు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. నిరంజన్ దంపతులు నిత్య పూజలు చేస్తున్నారు. చీపురుగూడెం-తిమ్మన్నపాలెం మధ్య గల కనకదుర్గమ్మను దుర్గామాతగా అలంకరించారు. వంట్ల పెదరామన్న దంపతులు విశేష పూజలు నిర్వహించారు. నల్లజర్లలోని వనదుర్గ ఆలయంలోని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అనంతపల్లిలోని స్వర్ణదుర్గాశ్రమంలో వల్లాల నాగబాబు, సుధారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన జరిగింది. అనంతపల్లి అన్నపూర్ణాదేవి గుడిలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, కుంకుమ పూజలు చేశారు.

దేవరపల్లి: మండలంలోని బందపురం గ్రామ కోదండరామాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించి, భక్తులు పూజలు చేశారు. దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారిని, బాలదుర్గమ్మ అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. స్థానిక చంద్రబాబు కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద అమ్మవారికి 108 కలశాల గోదావరి జలాలతో అబిషేకించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

మహిషాసుర మర్దినిగా..

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం రోడ్డులోని శ్రీదేవి ఆలయం వద్ద, దేవరపల్లి రోడ్డులోని లలితాంబిక అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారిని మహిసాసుర మర్దినిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా ఆలయాల వద్ద అన్న సమారాధనలు జరిగాయి.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ వారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. మలకపల్లి, వేగేశ్వరపురం గ్రామాల్లో మేదర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోను, బల్లిపాడు శివాలయంలోను, గజ్జరం, అన్నదేవరపేట, పైడిమెట్ట, పెద్దేవం, తాడిపూడి తదితర గ్రామాల అమ్మవార్ల ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు.

వేగేశ్వరపురంలోని మహాలక్ష్మమ్మ గుడి సమీపంలోని ఏర్పాటు చేసిన దుర్గమ్మ ఆలయం వద్ద చదలవాడ రత్నం అనే దాత ఆర్థిక సహాయంతో సుమారు 400 మంది భవానీ మాలధారులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ వారిని దుర్గాదేవిగా సుందరంగా అలంకరించారు.అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు చేశారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. ధనలక్ష్మి అమ్మ వారిని లిల్లీ పూలతో అలంకరించారు. ఇక మీనానగరం ముత్యాల దిబ్బవద్ద గల కనకదుర్గమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు చేశారు. ఊనగట్ల కనకదుర్గమ్మ గుడి వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మను దుర్గాదేవిగా అలంకరించారు. శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారిని పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

బ్రాహ్మణగూడెం వీధుల్లో భవానీలు ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో, వేప మండలను చేతబూని నృత్యాలు చేసుకుంటూ సాగిన ఊరేగింపు పలువురిని ఆకర్షించింది. ధూపసేవ నిర్వహించారు.

నిమ్మకాయలతో అలంకారం

పెరవలి: గవర్లపాలెంలోని దుర్గమ్మ వారి ఆలయాన్ని నిమ్మకాయలతో అలంకరించారు. వందలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తీపర్రులోని చింతాలమ్మ వారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అన్నవరప్పాడులో భవానీ మాలధారులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు కూడా నిప్పుల గుండం తొక్కారు. ఖండవల్లి, పెరవలి, కాకరపర్రు, తీపర్రు, కానూరు, ముక్కామల, అన్నవరప్పాడు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త, ఉండ్రాజవరం గ్రామాల్లో కొలువైన కనకదుర్గమ్మ, వేలివెన్ను కొండాలమ్మ, కె.సావారం ముత్యాలమ్మ అమ్మవార్ల దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. భవానీమాలధారులు అమ్మవార్లను దర్శించుకున్నారు.


కోటసత్తెమ్మ ఆలయం వద్ద సహస్ర కుంకుమ పూజల్లో భక్తులు


దుర్గామాతగా పోతవరంలోని కామాక్షీదేవి

క్లుప్తంగా

కొండాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు తదితరులు

పెరవలి: మండలంలోని కానూరులో కొలువైన కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దర్శించుకున్నారు. అక్కడున్న భవానీ మాలధారులతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రామును ఎమ్మెల్యే పరామర్శించారు. అనారోగ్యానికి గురైన రాము ఇటీవలే చికిత్స చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

ఉండ్రాజవరం: మండలంలో కె.సావరం గ్రామానికి చెందిన ఇర్రి అన్నపూర్ణ గత నెలలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వైఎస్సార్ బీమా కింద మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తంలో రూ.10 వేల తక్షణ సహాయాన్ని ఇంతకు ముందే మృతిరాలి భర్త ఇర్ర సూర్యారావుకు అందజేశారు. మిగిలిన రూ.4.9 లక్షల బీమా మొత్తాన్ని మృతురాలి భర్త బ్యాంకు ఖాతాలో జమ చేశామని పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో బసవా రామన్నరావు, మీసాల సురేష్, వర్రే రమేష్ (బాబీ) తదితరులు పాల్గొన్నారు.

భవానీ భక్తులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ

కొవ్వూరు: విజయవాడలోని దుర్గ గుడికి కాలినడకన వెళ్లే భవానీ దీక్షాధారులకు జనసేన పార్టీ నాయకులు గంగ్రోతు పవన్, కళ్లేపల్లి ప్రభాత్‌లు ఆదివారం అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు.ఆ పార్టీ నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ,ఉప్పులూరి చిరంజీవి, సుంకర సత్తిబాబు, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వార్డ్ మెంబర్ మృతి

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం పంచాయతీ మూడో వార్డ్ మెంబర్ బూరుగుపల్లి సత్యవతి (55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త పాపారావు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె భౌతికకాయానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ సరోజ కేశవ, ఎంపీటీసీ గాడి కృష్ణబర్ నివాళులర్పించారు.

డెలివరీ బాయ్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు
- జిల్లా గ్యాస్ డెలివరీ బాయ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నూతన ప్రధాన కార్యదర్శి గంటి కృష్ణ

కొవ్వూరు: గ్యాస్ కంపెనీల్లో పనిచేస్తున్న డెలివరీ బాయ్‌లకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు కోరారు. జిల్లా గ్యాస్ డెలివరీ బాయ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఆదివారం స్థానిక హోలీ ఏంజెల్స్ పాఠశాల్లో జరిగింది. కార్యక్రమంలో సుందరబాబు మాట్లాడుతూ గ్యాస్ కంపెనీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. పని చేస్తున్న సమయంలో కార్మికులు ఏదైనా ప్రమాదం సంభవిస్తే యాజమాని బాధ్యత తీసుకుని వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు గట్టి కృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని 47 గ్యాస్ ఏజన్సీల్లో సుమారు 800 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారందరికీ కార్మిక చట్టాలు సక్రమంగా అమలయ్యేలా కృషి చేస్తామన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం

గ్యాస్ డెలివరీ బాయ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడి ఎం.సుందరబాబు, అధ్యక్షుడిగా వి.దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా గంటి కృష్ణ, కోశాధికారిగా నసూర్ ఉల్లా ఖాన్, ఉపాధ్యక్షుడిగా గుమ్మాపు దానియేలు, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే ఉస్మాన్, కమిటీ సభ్యులుగా షేక్ హబీబుల్లా షరీఫ్, ఎర్ర శ్రీను ఎన్నికయ్యారు. మరో 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముగిసిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రాథమిక శిక్షణ

చాగల్లు: ప్రజల్లో దేశభక్తి, క్రమశిక్షణ సామరస్య భావలు, విద్యార్థుల్లో నైతిక విలువల పునరుద్ధరణకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) దేశవ్యాప్తంగా గత 98 ఏళ్లుగా నిరంతరం శ్రమిస్తోందని అఖిల భారత సంస్కృతి భారతీయ అధ్యక్షుడు దోర్బల ప్రభాకర శర్మ అన్నారు. స్థానిక వెలగపూడి రామకృష్ణ పబ్లిక్ హైస్కూల్లో ఈ నెల 15 నుంచి ఆదివారం వరకూ విద్యార్థులకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాథమిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం నాటి ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ప్రసంగించారు. శిక్షణ తరగతులు వారం రోజులూ వంద మంది విద్యార్థులకు కర్ర సాము, యోగా, కరాటే, దేశ భక్తి, మన చరిత్ర, హిందూ ధర్మం, సంస్కృతి విశిష్టత గురించి శిక్షణ ఇచ్చారన్నారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక వ్యక్తిత్వ విలువలు పెరిగేలా ఈ శిక్షణ సాగిందన్నారు. సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార ప్రముఖులు వేదులు జనార్దనరావు, సంఘ సభ్యులు వీవీ రామారావు, జుట్టా వెంకటగణపతి, కండిబోయిన సూర్య ప్రకాశరావు, తాళ్లూరి ప్రసాద్, తోలేటి సత్యనారాయణ, జిల్లాలోని అనేక గ్రామాల నుంచి సేవకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ 'పూర్వ' సమ్మేళనం


గోపాలపురం జెడ్పీ హైస్కూల్ 1985- 86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

గోపాలపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 1985-86 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం గోపాలపురంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో కలుసుకొన్నారు. గతంలో 12 ఏళ్ల క్రితం ఈ బ్యాచ్ విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. అప్పట్లో రూ .2 లక్షల వ్యయంతో పాఠశాలకు తాగునీటి మోటార్ సమకూర్చడమే గాకుండా ఓపెన్ ఫంక్షన్ హాలు నిర్మించారు. ఆదివారం నాటి రెండో అపూర్వ సమ్మేళనం సందర్భంగా దివంగతులైన తమ బ్యాచ్ విద్యార్థులకు వారంతా ఘన నివాళులు అర్పించారు. పాఠశాలలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని మధురానుభూతులను పంచుకున్నారు.

రావూరుపాడులో అగ్ని ప్రమాదం


పూర్తిగా కాలిపోయిన తాటాకు ఇల్లు

తాళ్లపూడి: మండలంలోని రావూరుపాడులో ఓ ఇంట్లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కొలిశెట్టి కృష్ణారావు తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇటుక గోడలతో నిర్మించి పై కప్పు తాటాకు వేశారు. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, నగదు, ఆభరణాలు, దుస్తులు, విలువైన పత్రాలు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. వీఆర్వో టి.సుజాత సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.

చికిత్స పొందుతూ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పట్టణంలోని రెండో వార్డుకు చెందిన మానేపల్లి రాకేష్ మణికంఠ (18) అనే ఇంజినీరింగ్ విద్యార్థి శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మణికంఠ తన మిత్రుడైన చింతలపూడి సాయికృష్ణతో కలిసి శనివారం బైక్‌పై వెళుతున్నాడు. వారి బైక్ కొవ్వూరులోని సీఎస్‌జీ బంక్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. మిత్రులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే చికిత్స పొందుతూ మణికంఠ మృతి చెందాడు. ప్రస్తుతం సాయికృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెబుతున్నారు. అతడికి తలకు బలమైన గాయాలయ్యాయి. మృతుడు మణికంఠ తండ్రి వీర వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భూషణం తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, రోటరీ క్లబ్ సభ్యులు పట్టణంలోని పలు గృహాలను సందర్శించి ప్రజలను, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారికి పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు, హ్యాండ్ వాష్ ఆవశ్యకతను వారు వివరించారు. సెల్‌ఫోన్ అధికంగా వాడడం వల్ల కలిగే రేడియేషన్‌తో దుష్పలితాలను వివరించారు. వివిధ కాలుష్యాల దుష్ఫలితాలు, నివారణ చర్యలు వివరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసు, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, గొన్నాబత్తుల రామారావు, గుంటుపల్లి శివకుమార్, పొన్నా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.